# ఓటును వినియోగించుకోవాలి

### కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, సెప్టెంబర్ 30 : ఓటరుగా నమోదైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఓటు ఎంతో పవిత్రమైందని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. స్వీప్ కార్యకలాపాల్లో భాగంగా ఓటరు నమోదు, ఓటు వినియోగంపై అవగాహన కల్పించేందుకు కళాశాల స్థాయిలో గత నెల 14న నిర్వహించిన నాటక, పాటల పోటీల్లో గెలుపొందిన వారికి శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటర్ల నమోదుకు, పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపొందించేందుకు ఎన్నికల సంఘం పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నదని అన్నారు. ఆన్‌లైన్‌తోపాటు వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారా ఓటరుగా నమోదుకు విస్తృత అవకాశం కల్పించిందని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం లభించిందని, విజ్ఞతతో ఓటు వేయాలని సూచించారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి శ్రీధర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ కిష్టయ్య, విద్యాశాఖ ప్రతినిధి శ్రీపతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

## స్వాతంత్ర్య సమరయోధుల సేవలు మరువలేనివి



స్వాతంత్ర్య సమరయోధుడి భార్యను సన్మానిస్తున్న తపాలా శాఖ అధికారులు, సర్పంచ్

భిక్కనూరు, సెప్టెంబర్ 30: స్వాతంత్ర్య ఉద్యమంలో సమర యోధుల సేవలు మరువలేనివని కామారెడ్డి పోస్టాఫీస్ సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ శ్రావణ్ కుమార్ అన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మండల కేంద్రంతోపాటు రామేశ్వర్‌పల్లి గ్రామంలో శనివారం మేరీ మిట్టీ మేరీ దేశ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుల ఇంటికి వెళ్లి వారి వారసులను సన్మానించారు. వారు నివసించిన ప్రదేశంలోని మట్టిని సేకరించి ప్రధాన మంత్రి కార్యాలయానికి పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భిక్కనూరు, రామేశ్వర్‌పల్లి సర్పంచులు తునికి వేణు, పోతిరెడ్డి, పోస్ట్ మాస్టర్ రాజేందర్‌రెడ్డి, తపాలా శాఖ అధికారులు మెహబూబ్‌రెడ్డి, వెంకట్ రాంరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## విజేతలకు సర్టిఫికెట్లు అందజేత



ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ దేవేందర్

కామారెడ్డి, సెప్టెంబర్ 30 : జిల్లా కేంద్రంలో స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా మున్సిపల్, మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్సే రైటింగ్, ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి మున్సిపల్ కమిషనర్ దేవేందర్ మున్సిపల్ కార్యాలయంలో శనివారం బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల్లో స్వచ్ఛతపై అవగాహన ఉండాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## 4న ఎస్సీ ఉపకులాల ఆత్మగౌరవ సభ

కామారెడ్డి రూరల్, సెప్టెంబర్ 30 : హైదరాబాద్‌లో ఈ నెల 4వ తేదీన నిర్వహించనున్న ఎస్సీ 57 ఉపకులాల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని కామారెడ్డి మండలం శాబ్దిపూర్ గ్రామానికి చెందిన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పస్తం పరశురాం కోరారు. శనివారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆత్మగౌరవ సభకు పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు బోరంచ రాజలింగం, ఉపాధ్యక్షుడు తిరుపతి, సంఘ సభ్యుడు కళ్లెం సత్యం, గోసంగి సంఘం అధ్యక్షుడు రాజరత్నం సాయిలు, గోసంగి జిల్లా ఉపాధ్యక్షుడు చిన్న దుర్గయ్య, గోసంగి సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి పాల్గొన్నారు.

## నేటి నుంచి అర్చకులకు పునశ్చరణ తరగతులు

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబర్ 30 : ఉమ్మడి జిల్లాలకు చెందిన 595 మంది ధూపదీప నైవేద్య అర్చకులకు ఆదివారం నుంచి పునశ్చరణ తరగతులు కొనసాగుతాయని ఉమ్మడి జిల్లాల దేవాదాయ ధర్మాదాయశాఖ సహాయ కమిషనర్ సుప్రియ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ శివారులోని మాధవ్‌నగర్ సాయిబాబా ఆలయ ప్రాంగణంలో మూడు రోజుల పాటు తరగతులు కొనసాగుతాయని తెలిపారు. పూజారి అవలంబించాల్సిన పద్ధతులు, పూర్ణకుంభ స్వాగతం, నమక, చమక రుద్రాభిషేకాలు, హిందూ సంప్రదాయ పద్ధతులు తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. ధూపదీప నైవేద్య అర్చకులందరూ శిక్షణ తరగతులకు హాజరు కావాలని సూచించారు.

## ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి, సెప్టెంబర్ 30 : నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈవో రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. http//bse.telangana.govi.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎయిడెడ్, వసతి సౌకర్యం లేని ఆదర్శపాఠశాలల్లో 7వ తరగతిలో 55 శాతం (ఎస్సీ, ఎస్టీ వారికి 50 శాతం) మార్కులతో ఉత్తీర్ణత పొంది 2022–23 విద్యా సంవత్సరంలో 8వ తరగతి చదువుతూ తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3,50,000లోపు ఉన్న విద్యార్థులు అర్హులని తెలిపారు.

పరీక్ష రుసుము బీసీ విద్యార్థులకు 100 రూపాయలు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.50 ఉంటుందని తెలిపారు. అక్టోబర్ 17వ తేదీలోగా సమర్పించాలని తెలిపారు.



బాన్సువాడ పట్టణంలో గణపతుల నిమజ్జనం కొనసాగుతున్నది. పాత బాన్సువాడకు చెందిన పలు కాలనీల్లో శనివారం గణపతుల శోభాయాత్రను నిర్వహించారు. - బాన్సువాడ టౌన్, సెప్టెంబర్ 30

## రేపు మాంసం విక్రయించొద్దు

కామారెడ్డి, సెప్టెంబర్ 30 : గాంధీ జయంతి సందర్భంగా సోమవారం పట్టణంలోని అన్ని చికెన్, మాంసం దుకాణాలు, చేపల మార్కెట్ మూసివేయాలని కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ దేవేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దుకాణాదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై చట్టరీత్య చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## సదరం క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

కామారెడ్డి, సెప్టెంబర్ 30 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా దవాఖానలో ఈ నెల 4, 5వ తేదీ, 18, 19వ తేదీల్లో సదరం శిబిరం నిర్వహిస్తున్నట్లు డీఆర్డీవో సాయన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ సదరం శిబిరం కొనసాగుతుందని తెలిపారు. ఆదివారం(నేడు) ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలని తెలిపారు.

## బోరుబావి తవ్వకం పనులు ప్రారంభం



బోరుబావి తవ్వకాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ శారద

దోమకొండ, సెప్టెంబర్ 30 : మండల కేంద్రంలోని 8వ వార్డులో ఎంపీపీ శారద బోరుబావి తవ్వాకాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. కాలనీలో నీటి సమస్య ఉందని ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ దృష్టికి తీసుకెళ్లడంతో బోరుబండిని పంపించినట్లు పేర్కొన్నారు. ఎంపీపీ కొబ్బరికాయలు కొట్టి పనులు ప్రారంభించారు. నీటి సమస్య తీర్చేందుకు కృషి చేస్తున్న ప్రభుత్వ విప్‌తోపాటు స్థానిక ప్రజాప్రతినిధులకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, సర్పంచ్ నల్లపు అంజలీశ్రీనివాస్, సీనియర్ నాయకుడు కుంచాల శేఖర్, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు శంకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పోచయ్య, రవికుమార్, శంకర్, సత్యనారాయణ, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఇంటి పన్ను చెల్లించి అభివృద్ధికి తోడ్పడాలి

బీబీపేట్, సెప్టెంబర్ 30 : ఇంటి పన్ను చెల్లించి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని సర్పంచ్ నర్సవ్వ, ఉపసర్పంచ్ స్వామి, పంచాయతీ కార్యదర్శి భరత్ అన్నారు. మండలంలోని కోనాపూర్ గ్రామంలో పంచాయతీ కార్యదర్శి భరత్ ఆధ్వర్యంలో శనివారం ఆయా వార్డుల్లోని ఇంటింటికీ వెళ్లి ఇంటి పన్ను వసూలు చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

రాజంపేట్, సెప్టెంబర్ 30 : పత్తి పంటలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కామారెడ్డి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు అపర్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలైలో కురిసిన వర్షాలు, ఆగస్టులో ఏర్పడిన తాత్కాలిక బెట్ట పరిస్థితులతో పత్తి మొక్కల ఎదుగుదల ఆశించినంతగా లేదని, పైపాటుగా వాడాల్సిన ఎరువులు, అంతరకృషి పనులు, సస్యరక్షణ చర్యలు సకాలంలో చేపట్టకపోవడంతో రసం పీల్చే పురుగులైన తామర పురుగు, పేనుబంక, పచ్చదోమ, తెల్లదోమ ఉధృతి ఎక్కువగా ఉన్నదని పేర్కొన్నారు. ప్రస్తుతం పూత, కాత దశలో ఉండడంతో రైతులు వ్యవసాయ అధికారుల సలహా మేరకు మందులు పిచికారీ చేయాలని సూచించారు.

# శీనన్నకు భారీ మెజార్టీ అందించాలి

### మాజీ జడ్పీటీసీ ద్రోణవల్లి సతీశ్



బైరాపూర్‌లో ఏడుగురు అనాథలకు ఇంటిరూంలు ఏర్పాటు చేయించి ప్రారంభిస్తున్న దృశ్యం

బాన్సువాడ, సెప్టెంబర్ 30 : బీర్కూర్ మండలం నుంచి రాబోవు ఎన్నికల్లో భారీ మెజార్టీని శీనన్నకు అందిస్తామని మాజీ జడ్పీటీసీ ద్రోణవల్లి సతీశ్ అన్నారు. శనివారం ఆయన బైరాపూర్ గ్రామంలో తన తండ్రి సీతారామయ్య జ్ఞాపకార్థం ఏడుగురు అనాథలకు ఇంటి సౌకర్యం కల్పించారు. సింగల్ రూం నిర్మించి ఏడుగురికి అందించారు. కుటుంబ సభ్యులతో కలిసి వారి ఇండ్లకు వెళ్లి రిబ్బన్ కట్ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సతీశ్ మాట్లాడారు. తాను ఉన్నంత కాలం పోచారం శ్రీనన్న వెన్నంటే ఉంటానని అన్నారు. మా నాయకుడు పోచారం అని తెలిపారు. ముఖ్యంగా ఖమ్మ సామాజిక వర్గానికి కాంగ్రెస్ పార్టీ చేసింది ఏమీలేదన్నారు. వ్యవసాయం చేసుకోవాడానికి ఈ ప్రాంతంలో స్థిరపడ్డామని, మన ఖమ్మలకు వ్యవసాయానికి రెండు పంటలకు సాగు నీరు, కరెంటు, రైతుబంధు తదితర కార్యక్రమాలను సీఎం కేసీఆర్ అందిస్తున్నారని తెలిపారు. స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డికి పేదరికం లేని బీర్కూర్‌ను తయారు చేయాలనే తపన ఉందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల మాటలు నమ్మొద్దని సూచించారు. దేశంలో ఎక్కడాలేనన్ని ఇండ్లను బాన్సువాడ నియోజకవర్గంలో పేదలకోసం నిర్మించి ఇచ్చిన పేదల నాయకుడు పోచారం శ్రీనివాసరెడ్డి అని కొనియాడారు. ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా పోచారం శీనన్న భారీమెజార్టీతో గెలుపొందేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ రఘు, ఎంపీటీసీ సందీప్ పటేల్, అవారి గంగారాం, ఆరిఫ్, మన్నన్, జడ్పీటీసీ స్వరూపాశ్రీనివాస్, సర్పంచ్ అంజవ్వలక్ష్మణ్, కుటుంబీకులు ద్రోణవల్లి అశోక్, ద్రోణవల్లి లక్ష్మీసతీశ్, కూతురులు రమ్యారోహిత్, రేష్మ సాయిశేశాంక్, తల్లి కస్తూరమ్మ, అప్పారావు తదితరులు ఉన్నారు.